క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డ పాత గోదాంలు, గాంధీనగర్, వడ్డెర బస్తీ, ఏబీవీ స్కూల్ ఏరియా, ఉర్దూ హాస్టల్, దేవాదుల క్యాంపు కార్యాలయం ఏరియాలో నేడు(బుధవారం) ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ పట్టణ ఏఈ బి.సౌమ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిర్నిగడ్డ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పరామర్శ



పల్లాను పరామర్శిస్తున్న తమ్మినేని

జనగామ: ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల స్వల్ప ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మంగళవారం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

108లో ప్రసవం



తల్లీ బిడ్డతో 108 సిబ్బంది

నర్మెట: ఇప్పలగడ్డకు చెందిన శ్రావణికి మంగళవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారమందించారు. స్పందించిన బచ్చన్నపేట 108 సిబ్బంది శ్రావణిని జనగామకు తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ఈఎంటీ భాస్కర్ చొరవతో సాధారణ ప్రసవంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం తల్లీ బిడ్డలను జనగామ ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పైలట్ సురేష్, ఈఎంటీ భాస్కర్‌లను కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రూపు సభ్యులు

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చుక్క రామయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా, హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సభ్యుడు తాళ్లపల్లి క్రాంతికుమార్, దోమ రవీందర్‌రెడ్డి, శివకుమార్, రవీందర్‌రెడ్డి, కుమారస్వామి, శ్రీనివాస్, మోటం రాములు, బత్తుల రాజన్‌బాబు ఉన్నారు.

కొన్నెలో..

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన చెందిన కుందారపు శ్రీకాంత్ మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్ గౌడ్ పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. గోపాల్, రమేష్, దశరథ, లక్ష్మినారాయణ, యాదగిరి, శ్రీనివాస్ ఉన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి'

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమవుతుందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం ధరావత్ తండా, బంజారా, చిన్నమాడురు గ్రామాలలో పల్లెబాటలో ఆమె పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకుడు ఉప్పల సురేష్‌బాబు, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ ధర్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పాండు కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తార, రసూల్, గణేష్,రామచంద్రునాయక్, వెంకన్న, , ఆయా గ్రామాల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభానికి సిద్ధం

- 40మందికి పైగా విద్యార్థుల చేరిక
- నేలపోగులలో నేడు డీఈఓ చేతుల మీదుగా ప్రారంభం

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగుల రత్నమాల కేసరి మెమోరియల్(ఎంపీయూపీఎస్) పాఠశాలలో ప్రీప్రైమరీ పాఠశాల జిల్లాలోనే మొట్టమొదటిదిగా ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పీఎంశ్రీ పథకంలో భాగంగా ఎంపికైన నేలపోగుల ఎంపీయూపీఎస్‌లో 3 నుంచి ఐదేళ్ల వయసు గల చిన్నారులను పాఠశాలలో చేర్చుకుని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యాబోధన చేయనున్నారు. ప్రీప్రైమరీలో ఎల్‌కేజీ, యూకేజీ బోధన చేసేందుకు ఇన్‌స్ట్రక్టర్‌తో పాటు ఆయాను కూడా నియమించారు. అందుకు సంబంధించి ఇప్పటికే పాఠశాలలో విద్యార్థుల బోధనకు రెండు తరగతి గదులను సిద్ధం చేశారు. అందులో రంగురంగుల బొమ్మలు, ఆట వస్తువులు, లర్నింగ్ మెటీరియల్ కూడా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఇప్పటికే 40 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. నేడు డీఈఓ చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించనున్నారు. అంతేకాకుండా గ్రామంలో నుంచి చిన్నారులు పాఠశాల వరకు నడిచి వెళ్లలేనందున ఎన్‌ఆర్ఐ లక్ష్మీనారాయణ వారి కోసం ఆటోను కూడా ఏర్పాటు చేశారు.



ప్రీ ప్రైమరీ తరగతి గదిలో విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే సదస్సులు

- సీజీఆర్ఎఫ్ఐ చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి

కొడకండ్ల: విద్యుత్ వినియోగదారుల సంక్షేమమే ధ్యేయంగా విద్యుత్ సమస్యలను పరిష్కరించడమే వినియోగదారుల సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమని సీజీఆర్ఎఫ్ఐ చైర్ పర్సన్ ఎన్.వి.వేణుగోపాలాచారి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్ర ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారుల ద్వారా స్వీకరించిన ప్రతి వినతికి పరిష్కారం ఉంటుందని, ఎలాంటి సమస్యలున్నా లిఖిత పూర్వకంగా అందించాలని కోరారు. పాకాలలో ఏజీ లైన్‌కు సంబంధించిన లూజ్ వైర్లను సవరించడంలో నిర్లక్ష్యం వహించడంపై ఏఈతో పాటు సిబ్బందిని చైర్‌పర్సన్ మందలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సదస్సులో ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్‌పై 15, ఇంటిపై నుంచి లైన్‌లు మార్చాలని 5, లూజ్‌లైన్లు సవరించాలని 12, పేరు మార్పిడి గురించి ఒక విజ్ఞప్తులు చొప్పున రాగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను చైర్ పర్సన్ ఆదేశించారు. ఈ సదస్సులో సీజీఆర్ఎఫ్ఐ సభ్యులు రమేష్, రామారావు, జనగామ ఎస్ఈ వేణుమాధవ్, ఎస్ఏఓ జయరాజ్, డీఈలు రాంబాబు, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఫలితాలు

- ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్‌లో 2025లో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకాల అందజేత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.సంపత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెరుగైన మౌలిక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం 2025 పదవతరగతి వార్షిక పరీక్షల్లో పాఠశాల నుంచి ఉత్తమ ప్రతిభతో 570 మార్కులు సాధించిన విద్యార్థిని అక్షరను పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రవీందర్, వారి కుటుంబ సభ్యులు శివప్రసాద్, వంశీప్రసాద్, రవీందర్, జీవన్‌మౌనిక, బుచ్చిరాజు, సిద్ధిరాములు ఆర్థిక సహకారంతో రూ.11వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ కొమురయ్య, ఉపాధ్యాయులు శ్రీకాంత్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న ఆర్డీఓ తదితరులు

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నా రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. రైతులకు రైతు భరోసా ఇస్తున్న నేపథ్యంలో మంగవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ పంటల సాగు కోసం సకాలంలో రైతు భరోసా ఇస్తున్నారన్నారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, జిల్లా యూత్ అధ్యక్షుడు బానాసి క్రాంతికుమార్, పోకల శివకుమార్, తోటకూర రమేష్, ఎండీ బాషుమియా తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాంబాబు, జగదీష్‌చందర్‌రెడ్డి తదితరులు

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, భక్తులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని పూజలు



బొడ్రాయి వద్ద జల బిందెలతో మహిళలు



పాలకుర్తి: కప్పతల్లి ఆట ఆడుతున్న మహిళలు

జఫర్‌గఢ్/పాలకుర్తి: షాపల్లి గ్రామంలో వరుణుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మహిళలు మంగళవారం బొడ్రాయికి జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామం నలిగానితండాలో వానలు పడాలని గిరిజన మహిళలు కప్పతల్లి ఆట ఆడి పూజలు చేశారు.

నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా వేణు



వేణుకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీరాములు

స్టేషన్‌ఘన్‌పూర్: నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రానికి చెందిన కొలిపాక వేణు వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి తిరుపతి ఆధ్వర్యంలో మండల నాయీబ్రాహ్మణ కమిటీ సమావేశం మంగళవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించారు. ముందుగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కొలిపాక వేణు, ప్రధాన కార్యదర్శి కుంభోజు గౌరేష్, కోశాధికారి కొడెపాక యాకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక మహేందర్, గౌరవ అధ్యక్షుడు కొలిపాక శంకర్, ఉపాధ్యక్షుడు సొన్నాయిల వెంకటేష్, సలహాదారులుగా తిరుమలేష్, రవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ వరుసగా రెండోసారి మండల కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి జిల్లా కమిటీ ఆదేశాల మేరకు తన శాయశక్తులా పనిచేస్తానన్నారు. నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తపల్లి వెంకటేష్, కోశాధికారి ప్రశాంత్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సృజన

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి సృజన అన్నారు. 'వీఎస్ఆర్ నగర్‌లో విషజ్వరాలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మంగళవారం ఫీవర్ క్యాంపును ఏర్పాటు చేశారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ రమ్య, ఏఎన్‌ఎం చల్ల ప్రణీత, ల్యాబ్ టెక్నీషియన్ వనిత, పంచాయతీ కార్యదర్శి రుబీనాసుల్తానా, ఆశ కార్యకర్తలు ఇజ్జగిరి అనిత, సంధ్య, అరుణ, శారద పాల్గొన్నారు.

కేబుల్ చోరీ నిందితుడి అరెస్ట్

కొడకండ్ల: మండలంలోని నర్సింగాపురం గ్రామ శివారులోని కెనాల్ పక్క రైతులకు సంబంధించిన మోటర్ కేబుల్‌ను చోరీ చేసిన నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసిరిమాండ్‌కు పంపినట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. గత నెలలో నర్సింగాపురం శివారులో మోటర్లకు సంబంధించిన వైర్లు చోరీ చేసినట్లు రైతులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య నేరస్తున్ని పట్టుకొనేందు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ బృందం ప్రతిభకనబర్చి చోరీకి పాల్పడిన వరంగల్ శంబునిపేట ఎంఎం నగర్‌కు చెందిన బొమ్మిశెట్టి అశోక్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి రూ.20 వేల విలువ చేసే మోటర్ కెబుల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు గతంలో జగిత్యాల జిల్లాలోని రామడుగు పీఎస్ పరిధిలో ఇదే తరహాలో కేబుల్ వైర్ చోరీ చేసి అరెస్ట్ అయ్యాడని, రైతులకు ఇబ్బందికి కలిగించి ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. నేరస్తుడిని పట్టుకోవడంలో ప్రతిభ చాటిన కొడకండ్ల ఎస్సై చింత రాజు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు అరుణ్, రాకేష్, రఘుపతి, వెంకటేష్‌లను డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ నర్సయ్యలతో పాటు సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

'విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రైవేట్ విద్యాసంస్థలు'

రఘునాథపల్లి: విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ ఆరోపించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల స్కూల్ స్టేషనరీ సామగ్రిని సీజ్ చేయాలనే డిమాండ్‌తో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లవకుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు పరిమితికి మించి ఫీజులు తీసుకుంటూ దోచుకుంటున్నాయన్నారు. ఎంఈఓ, డీఈఓలు వెంటనే స్పందించి ప్రైవేట్ యజమాన్యలపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

జనగామ రూరల్: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై నియంత్రించాలని బీజేపీ పట్టణ నాయకుడు పెద్దోజు జగదీష్ కోరారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో డీఈఓ భోజన్నకు వినతి పత్రం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు విద్యా వలంటీర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం ఎస్.అమృత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠాలు బోధించడంతోపాటు పిల్లల అవసరాలు తీర్చేందుకు ఆసక్తిగల వారు ఈ నెల 21వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మండల కేంద్రంలో మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమాచారం మేరకు సదాశివపేట వాగు వద్ద అక్రమంగా ఇసుకను నింపుకున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని తెలిపారు. గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన చింతల అరుణ్‌కుమార్ ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలి

చిల్పూరు: జూలై 7వ తేదీన అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ చాడ ఏలియా పిలుపునిచ్చారు. లింగంపల్లిలో మంగళవారం గ్రామ శాఖ అధ్యక్షుడు బొట్టు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఏలియా మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.

విద్యుత్ అధికారుల కొత్త నంబర్లు


కొడకండ్ల: విద్యుత్ అధికారులతో పాటు సబ్‌స్టేషన్‌లకు కొత్త ఫోన్ నంబర్లను కేటాయించారు. మండల ఏఈ ఫోన్ నంబర్ 8712482738, సబ్ ఇంజనీర్ 8712482761, కొడకండ్ల లైన్ ఇన్‌స్పెక్టర్ 8712482857, లైన్‌మన్ 8712482858, కొడకండ్ల సబ్‌స్టేషన్ 8712482934, మొండ్రాయి సబ్‌స్టేషన్ 8712482935, ఏడునూతుల సబ్‌స్టేషన్ 8712482936, పాలకుర్తి ఏడీఈ 8712482697, పాలకుర్తి ఏఏఓ ఈఆర్‌ఓకు 8712482703 నంబర్లను కేటాయించారు.

నిత్యావసరాల అందజేత



పాలకుర్తి: మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గుండెవేని రంజిత్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం పాలకుర్తి అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

పాలకుర్తి సీఐగా జానకీ రామ్‌రెడ్డి



పాలకుర్తి టౌన్: పాలకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వంగాలి జానకీ రామ్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకుర్తి సీఐగా గట్ల మహేందర్‌రెడ్డి మహబూబాబాద్ సీఐగా బదీలి కాగా సిద్దిపేట కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న జానకీ రామ్‌రెడ్డి పాలకుర్తి సీఐగా బదిలీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాలకుర్తి టౌన్: బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. బైక్‌లు ఢీ కొనడంతో మండల కేంద్రాకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కమ్మగాని నాగన్న, ఎస్సీ కాలనీకి చెందిన గాదెపాక శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా ఇద్దరికి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



నర్మెట: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ ఐలయ్య



కొడకండ్ల: పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం తదితరులు

- ఎంఈఓ మడిపల్లి ఐలయ్య

నర్మెట: బడీడుపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో, రెండేళ్ల నిండిన వారిని అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ–1 సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం వేణు, డబ్ల్యూటీఎస్ రజితకుమారి, సృజన, శోభాదేవి, స్వరూరాణి, విజయలక్ష్మి, ఏడబ్ల్యూహెచ్ రాజమణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సామగ్రి పంపిణీ

మల్కపేట ఎంపీపీఎస్ పాఠశాలలో నూతనంగా అడ్మిషన్లు పొందిన 15 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో ప్లేట్లు, పలకలు, టై, బెల్టులు అందజేసినట్లు హెచ్‌ఎం గంగరాజు కేశవరావు తెలిపారు. మన ఊరి.. మన బడిని మనమే కాపాడుకోవాలని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు కేశవపట్నం మధుసూదన్, కేసోజు ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు..

కొడకండ్ల: నిరుపేద విద్యార్థుల విద్యాభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం దోర్నం ప్రభాకర్ కోరారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఉమేష్, వేణు, వెంకటయ్య, కవిత పాల్గొన్నారు.

మరిగడిలో..

జనగామ రూరల్: తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత అన్నారు. మరిగడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు యాకలక్ష్మి ఎస్.సుజాత హెల్పర్ సత్తెమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం

జఫర్‌గఢ్: కోనాయిచలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, గీతారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికలు

బచ్చన్నపేట/రఘునాథపల్లి/జఫర్‌గఢ్: రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఈ నెల 18వ తేదీ(బుధవారం)న రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, బచ్చన్నపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, జఫర్‌గఢ్ స్థానిక ఉన్నత పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు వెంకట్‌రెడ్డి రఘునందన్ రెడ్డిలు మంగళవారం తెలిపారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి నాల్గవ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో నాల్గవ తరగతిలో ప్రవేశాల కొరకు ఈనెల 19వ తేదీన తరిగొప్పుల మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ నెల్లుట్ల జానకి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు 25వ తేదీన జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొనాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

రఘునాథపల్లి/జఫర్‌గఢ్/పాలకుర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన వికసిత్ భారత్ సంకల్పసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని రామాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాలకుర్తి సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయా సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూసమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం

దేవరుప్పుల: అపరిష్కృత భూసమస్యల పరిష్కారానికి తలపెట్టిన రెవెన్యూ సదస్సులు చక్కటి అవకాశాలని జనగామ ఆర్డీఓ గోపీరామ్ అన్నారు. మంగళవారం చిన్నమడూరులో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 153 మంది రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పలువురి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అప్పిరెడ్డిపల్లెలో ముత్యం చెరువు అన్యాక్రాంతమవుతుందన్న ఫిర్యాదుల మేరకు ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుకు అనుకొని ఉన్న మూడు గ్రామాల సరిహద్దులను సర్వే చేయించి చెరువు విస్తీర్ణం పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ ఆండాళ్, నాయబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ రాజుహేఎస్ఓ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'భూ భారతి' సదస్సులు

జఫర్‌గఢ్/బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు పలు మండలాల్లో కొనసాగుతున్నాయి. మంగళవారం అధికారులు రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం లభించనుందని తెలిపారు. తహసీల్దార్లు శంకరయ్య, ఫణికిషోర్, డీటీ స్రవంతి, అనిల్ బాబు, ఆర్ఐలు ఉన్నారు.